క్లుప్తంగా

నేడు పంచాయతీ కార్యదర్శుల సమావేశం

చీరాల టౌన్: మండలంలోని అన్ని గ్రామపంచాయతీల కార్యదర్శులు, సచివాలయాల అడ్మిన్లతో సోమవారం సమావేశాన్ని నిర్వహిస్తున్నామని ఎంపీడీఓ బి.శివన్నారాయణ ఆదివారం తెలిపారు. ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించే సమావేశానికి హాజరయ్యే పంచాయతీ కార్యదర్శులు, సచివాలయాల అడ్మిన్లు సమాచారం, వివరాలతో హాజరుకావాలని సూచించారు.

నేడు బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ

కారంచేడు: మండలంలోని కుంకలమర్రులో సోమవారం బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ జువ్వా శివరాం ప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వైఎస్సార్ సీపీ పర్చూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్, రాష్ట్ర కార్యదర్శి గాదె మధుసూదన రెడ్డి హాజరు కానున్నట్లు ఆయన తెలిపారు. మండలంలోని వివిధ హోదాల్లో ఉన్న నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు,అభిమానులు హాజరు కావాలని కోరారు.

గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు


కారంచేడులో ప్రత్యేక అలంకరణలో గంగమ్మ తల్లి

కారంచేడు: గ్రామ దేవతగా విరాజిల్లుతున్న గంగమ్మ తల్లికి ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. అమ్మవారికి విశేష పూజలు చేసి పొంగళ్ళను నైవేద్యంగా సమర్పించారు. శ్రావణమాసంలో ఆదివారం అమ్మవారికి ప్రీతికరమైన రోజుగా అభివర్ణించి భక్తులు అమ్మవారి దర్శనం కోసం బారులు తీరారు. కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా అమ్మవారు భక్తులు ఏమి కోరుకున్నా తీర్చుతుందని భక్తుల విశ్వాసం. ఆలయ అర్చకులు ఆవుల రాజేష్ భక్తులతో పూజలు చేయించి తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

ఘనంగా మాజీ రాష్ట్రపతి వీవీ గిరి జయంతి


వీవీ గిరి చిత్రపటానికి పటానికి పూలమాలలు వేస్తున్న లైబ్రేరియన్, విద్యార్థులు

సంతమాగులూరు (అద్దంకి రూరల్): సంతమాగులూరు శాఖ గ్రంథాలయంలో ఆదివారం లైబ్రేరియన్ బాదం విజయభాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో మాజీ రాష్ట్రపతి స్వర్గీయ వీవీ గిరి జయంతి వేడుకలు నిర్వహించారు. దీనిలో భాగంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు చదవటం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు.

శ్రీకృష్ణను వెంటనే అరెస్ట్ చేయాలి

చీరాల:పెత్తందారనే అహంకారంతో కారంచేడు గ్రామంలో మూగ, చెవిటి అయిన యువతి దేవికపై దాడి చేసిన యార్లగడ్డ శ్రీకృష్ణ, అతని భార్యను తక్షణమే అరెస్ట్ చేసి బాధిత రజకులపై పెట్టిన తప్పుడు కౌంటర్ కేసును ఎత్తివేయాలని రజక వృత్తిదారుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ఎన్జీఓస్ కార్యాలయంలో రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. బలహీన వర్గాలకు చెందిన రజకులపై ఎటువంటి విచారణ లేకుండా కేసు నమోదు చేయడం న్యాయ విరుద్ధమని తీవ్రంగా విమర్శించారు. ఈ ఘటనపై సోమవారం కలెక్టర్‌కు వినతి పత్రం అందిస్తామన్నారు.

ఇన్‌చార్జుల పాలనతో ఇక్కట్లు

- సర్వేయరు, ఇద్దరు జూనియర్ అసిస్టెంట్‌లతో విధులు
- పూర్తిస్థాయి అధికారులు లేక పనుల్లో జాప్యం


తహసీల్దార్ కార్యాలయం

వేటపాలెం: ముఖ్యమైన పరిపాలన శాఖలో ఇన్‌చార్జుల పాలన కొనసాగుతోంది. ఆయా శాఖల్లో పూర్తిస్థాయి అధికారులు లేక పోవడంతో జిల్లా ఉన్నతాధికారులు ఇన్‌చార్జులను నియమించారు. ప్రధాన శాఖకు పూర్తిస్థాయి అధికారులు లేక పోవడంతో పాలనా వ్యవహారాల్లో జాప్యం ఏర్పడుతోంది. ప్రధానంగా తహసీల్దార్ కార్యాలయంలో మూడు నెలల కిందట ఇక్కడ పనిచేసిన తహసీల్దార్‌పై వచ్చిన అవినీతి ఆరోపణల కారణంగా జిల్లా కలెక్టర్ ప్రభుత్వానికి సరెండర్ చేశారు. అప్పటి నుంచి గడిచిన మూడు నెలులగా చీరాల తహసీల్దార్ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. అదే నెలలో అదే రోజున డిప్యూటీ తహసీల్దార్ డిప్యూటేషన్‌పై వెళ్లిపోయారు. ఇక రెండేళ్లగా ఆర్‌ఐ పోస్టు ఖాళీగా ఉంది. ఇటీవల సీనియర్ అసిస్టెంట్.. ప్రమోషన్‌పై బదిలీ అయ్యారు. ప్రస్తుతం సర్వేరు, ఇద్దరు జూనియర్ అసిస్టెంట్‌లు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. రెవెన్యూ కార్యాలయంలో రెగ్యులర్ తహసీల్దార్ లేక పోవడంతో ప్రజలు కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా ఫలితం లేకుండా పోతోంది. ఫలితంగా మండలంలో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. రెగ్యులర్ బాధ్యతలతో పాటు అదనపు బాధ్యతలను కూడా నిర్వహించడంతో పాలన నత్తనడకన సాగుతోంది. రెవెన్యూ కార్యాలయంలో ప్రధాన సిబ్బంది లేక పోడంతో ప్రజలు ప్రభుత్వ సేవలు లేక పోందలేక పోతున్నారు. ప్రజలకు ముఖ్యమైన ఈడబ్ల్యూఎస్, ఏబీసీ, ఈబీసీ, కులధ్రువీకరణ పత్రాలను మంజూరు విషయంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కార్యాలయం చుట్టూ తిరగాల్సిన పరిస్థితి వస్తుందని వాపోతున్నారు. ఇన్‌చార్జి తహసీల్దార్ విధులు నిర్వహిస్తుండటంతో ముఖ్యమైన సర్టిఫికెట్ల మంజూరు చేసేందుకు జాప్యం ఏర్పడుతుంది. ఇకనైనా జిల్లా ఉన్నత అధికారులు స్పందించి ముఖ్యమైన శాఖలకు రెగ్యులర్ అధికారులను నియమిస్తేనే సమస్యలు పరిష్కారమవుతాయని, ఆ దిశగా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రతిష్ఠా మహోత్సవాలకు అంకురార్పణ


ఆలయం ముందు భక్తుల కోలాహలం


ప్రతిష్ఠకు సంబంధించి అంకురార్పణ పూజలు

- కొత్తూరులో రూ. 40 లక్షలతో గ్రామదేవతల ఆలయ నిర్మాణం
- 14న ఉదయం 11.58 గంటలకు ప్రతిష్ఠా మహోత్సవాలు


కొత్తూరులో నూతనంగా నిర్మించిన అమ్మవారి, యాగశాల

బల్లికురవ: గ్రామస్తుల సమష్టి కృషి సుమారు రూ. సుమారు రూ. 40 లక్షలతో గ్రామదేవతలైన పోలేరమ్మ, అంకమ్మతల్లి, పోతురాజు విగ్రహాలతో పాటు వెంకటేశ్వర స్వామి శంకు చక్రనామాలు ఓకే ప్రాగణంలో ప్రతిష్ఠించేందుకు ఆలయాన్ని నిర్మించారు. ఈ నెల 14వ తేదీ గురువారం ఉదయం 11.58 గంటలకు ప్రతిష్ఠా మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ ఆదివారం తెలిపారు. ప్రతిష్ఠాచార్యులు బ్రహ్మశ్రీ కృష్ణ శర్మ బృందంచే ఆదివారం ఉదయం అంకురార్పణ చేశారు. ఆలయంలో పక్కనే ఏర్పాటు చేసిన యాగశాల వద్ద మహాగణపతి పూజ పుణ్యాహవచన, పంచగవ్యప్రాసన, దీక్షాధారణ, యాగశాల ప్రవేశం, కర్కరీ స్థాపన, ధ్వజ, పతాకావిష్కరణ చేపట్టారు. సాయంత్రం వాస్తుపూజ, హోమం, పర్యగ్నికరణ, మహాస్నానం, అంకురారోపణ, అగ్ని ప్రతిష్ఠాపన, తీర్థప్రసాదాల పంపిణీ చేపట్టారు. సోమ, మంగళ, బుధవారాల్లో నిత్యపూజలు, హోమాలు తదుపరి గురువారం యంత్ర, విగ్రహ, శిఖ ప్రతిష్ఠ, మహా పూర్ణాహుతి, కుంభాభిషేకం, అన్నసంతర్పణ చేపడుతున్నట్లు ఆలయ కమిటీ వారు వివరించారు. బంధుమిత్రుల రాకతో ప్రతి ఇంటా పండుగ వాతావరణం నెలకొంది.

డెంగీ ప్రబలకుండా చర్యలు తీసుకోండి


వైద్య సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఎంపీడీఓ


కారంచేడులో లోతట్టు ప్రాంతాల్లోని నీటి తొట్లను పరిశీలిస్తున్న పీడీ విజయలక్ష్మి

- బాపట్ల డ్వామా పీడీ విజయలక్ష్మి

కారంచేడు: వాతావరణంలో వస్తున్న మార్పులను బట్టి డెంగీ జ్వరాలు ప్రబలకుండా ఉండేందుకు ముందస్తు చర్యలు చేపడుతున్నామని బాపట్ల జిల్లా డ్వామా పీడీ విజయలక్ష్మి అన్నారు. ఆదివారం ఆమె మండల కేంద్రమైన కారంచేడు, స్వర్ణ గ్రామాల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. కలెక్టర్ వెంకటమురళి ఆదేశాల మేరకు జిల్లాలని ప్రతి పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాలను ఎంపిక చేసిన వైద్య సిబ్బందితో ఫీవర్ సర్వేలను ముమ్మరంగా చేపట్టామన్నారు. వైద్య సిబ్బందితో ఇంటింటికీ జల్లెడ పట్టే విధంగా సర్వే చేయిస్తున్నామన్నారు. ఈ సర్వేతో గ్రామాల్లోని ప్రజలకు వైరల్ ఫీవర్స్ ఉంటే వారి లక్షణాలను బట్టి అవసరమైన అన్ని రకాల పరీక్షలు, వైద్య సేవలను అందించేందుకు వీలుంటుందన్నారు. అలాగే గ్రామాల్లోని పారిశుద్ధ్య కార్యక్రమాలను కూడా చేపడుతున్నామన్నారు. సెలవులు లేకుండా పనిచేయిస్తున్నామన్నారు. ప్రజలు కూడా కేవలం మీ ఇంటిలోనే కాకుండా ఇంటి పరిసరాల్లో చెత్తా, చెదారం ఎక్కడ పడితే అక్కడ వేసి అపరిశుభ్రంగా వాతావరణం తీసుకురావద్దని ఆమె హితవు పలికారు. గ్రామ సర్పంచ్‌లు, గ్రామ కార్యదర్శులు సమన్వయంతో పనిచేస్తూ చెత్తను ఎప్పటికప్పుడు సేకరించేలా చర్యలు తీసుకున్నామన్నారు. ఎంపీడీఓ కె. నేతాజీ, మెడికల్ ఆఫీసర్ హస్నప్రియ, ఈఓపీఆర్డీ రాంమ్మోహన్, సర్పంచ్ మోటాని మధుసూదనరావు, కార్యదర్శి ఆశాజ్యోతి, వైద్య సిబ్బంది, పంచాయితీ సిబ్బంది పాల్గొన్నారు.


స్వర్ణ పీహెచ్‌సీలో మాట్లాడుతున్న వైద్యాధికారులు

జ్వర లక్షణాలుంటే అశ్రద్ధ వద్దు

స్వర్ణ (కారంచేడు): వైరల్ ఫీవర్స్‌ను నిరోధించేలా వైద్య సిబ్బంది అహర్నిశలు కష్టపడి పనిచేస్తున్నారని, గ్రామాల్లో ఎవరైనా జ్వర లక్షణాలతో ఉంటే వెంటనే సమీప ఆసుపత్రికి రావాలని కారంచేడు, స్వర్ణ పీహెచ్‌సీల వైద్యాధికారులు డాక్టర్ పృథ్వీరాజ్, డాక్టర్ హస్నప్రియ అన్నారు. ఆదివారం మండలంలోని స్వర్ణ పీహెచ్‌సీలో ఫీవర్ సర్వేలపై వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. సిబ్బంది ఇంటింటికీ వచ్చి ఫీవర్ సర్వేలు చేయాలన్నారు. జ్వరంతో ఉన్న వారి నుంచి రక్త నమూనాలు సేకరించి వెంటే టైఫాయిడ్, మలేరియా, అవసరమైతే డెంగీ పరీక్షలను చేయాలన్నారు. వారి రిపోర్టుల ఆధారంగా వెంటనే వారికి వైద్య సేవలు అందించాలన్నారు. చీరాల సబ్ యూనిట్ ఆఫీసర్ రవిబాబు, వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశలు పాల్గొన్నారు.

అద్దంకి రూరల్: మండలంలోని తిమ్మాయపాలెంలో ఎంపీడీవో శింగయ్య ఆధ్వర్యంలో వైద్యసిబ్బంది జ్వరాల సర్వే నిర్వహించారు. డెంగీ, మలేరియా దోమల నివారణపై అవగాహన కార్యక్రమాలు ఇంటింటి ప్రచారం చేపట్టాలని సూచించారు. జ్వరాల సర్వే డ్రైడే కార్యక్రమాలు నిరంతరం చేయాల్సిందిగా వైద్య సిబ్బందికి, పంచాయితీ కార్యదర్శులకు సూచించారు. వైద్యసిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక చర్యలు చేపట్టాలి


అధికారులకు సూచనలిస్తున్న డ్వామా పీడీ విజయలక్ష్మి

పర్చూరు(చినగంజాం): పారిశుద్ధ్యంపై ప్రత్యేక చర్యలు చేపట్టాలని ప్రత్యేకాధికారి డ్వామా పీడీ ఏ. విజయలక్ష్మి సూచించారు. ఆదివారం ఉప్పుటూరులో మండల అధికారులు, పంచాయతీ అధికారులతో కలిసి పరిశీలించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలనే విషయమై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పంతాయతీ కార్మికుల ద్వారా మురుగునీరు కాలువల్లో మురుగునీరు నిలువ ఉండకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలన్నారు. కాలువల చుట్టు పక్కల నీరు నిలువ ఉండే చోట బ్లీచింగ్ చల్లాలని, దోమల లార్వాల నిర్మూలనకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. దోమలకు ఆవాసాలుగా మారే డ్రైనేజీ నీటి కుంటలను గుర్తించి ఆయిల్ బాల్స్ స్ప్రే చేయాలని, దోమల నిర్మూలనకు ఫాగింగ్ చేయాలని తెలిపారు. వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ప్రజలు తమ గృహ పరిసరాలు చుట్టూ నీటి నిలువలు లేకుండా చూసుకోవాలని కోరారు. వర్షపు నీరు నిలువ ఉండే వాడిపడేసిన కొబ్బరి బోండాలు, ప్లాస్టిక్ గ్లాసులు, పాత టైర్లు, మూత లేకుండా నీటితో ఉన్న ప్లాస్టిక్ డబ్బాల్లో దోమలు ఉత్పత్తి అవుతాయని వీటి వల్ల డెంగ్, చికున్ గున్యా, మలేరియా, ఫైలేరియా వంటి వ్యాధులు సంక్రమిస్తాయని తెలిపారు. ఎంపీడీఓ వి. ప్రద్యుమ్నకుమార్, డిప్యూటీ ఎంపీడీఓ కె. సత్యనారాయణ, కార్యదర్శి ముత్యాల శ్రీనివాసరావు, సర్పంచ్ తిరుమలేశ్వరరావు పాల్గొన్నారు.

హామీల మాటేంటో చెప్పండి బాబూ!


పోస్టర్ ఆవిష్కరిస్తున్న మండల కన్వీనర్, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు

యద్దనపూడి: ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీల మాటేంటో చంద్రబాబు చెప్పాలని, బాండులో రాసిచ్చిన హామీలు నెరవేర్చే వరకు ప్రజల తరపున వైఎస్సార్‌సీపీ ఉద్యమిస్తుందని వైఎస్సార్ సీపీ యద్దనపూడి మండల కన్వీనర్ రావూరి వేణుబాబు అన్నారు. ఆదివారం యనమదలలో బాబు ష్యూరిటీ– మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు చేసిన మోసాలపై ప్రజలకు క్యూ ఆర్ కోడ్ ద్వారా వివరించారు. అధికారం చేపట్టి 14 నెలలు దాటుతున్నా మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు అమలు చేయలేదన్నారు. మువ్వల రాంబాబు, రాయి పృథ్వీరాజు, దొడ్డా బ్రహ్మానందం, కర్లపూడి సుధాకర్, జంగా పెదబాబు, రాంబాబు, ఏలియా, అట్లూరి ఏస్కేలు, పుల్లారావు, పెద శ్యాంబాబు, షేక్ బుడే, నల్లపునేని వేణు, వీరయ్య, వీరేంద్ర, లక్ష్మయ్య పాల్గొన్నారు.

స్వార్థం విడనాడాలి


దయానందకి నివాళులర్పిస్తున్న స్వామీజీ

వేటపాలెం: స్వార్థం విడనా సేవలు పెంపొందించుకోవాలని ఛాత్రాలయాల రాష్ట్ర కార్యనిర్వాహకులు సరస్వతి పేర్కొన్నారు. స్థానిక గొల్లపూడి వీధిలోగల జీవీకేసీ స్వామి దయానంద ఛాత్రాలయంలో ఆదివారం గురువందన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా దయానంద చిత్రపటానికి పూలమాళలు వేసి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న స్వామిజీ మాట్లాడుతూ తోటి స్నేహ సంబంధాలతో ఉన్నత విద్యను పొందాలని సూచించారు. సేవా కార్యక్రమాల్లో ముందుండాలన్నారు. పట్టభద్రుల సంఘం అధ్యక్షుడు ప్రత్తి వెంకటసుబ్బారావు, సెక్రటరీ ఎస్‌వీఎల్ ప్రసాద్, వల్లంపట్ల మురళీకృష్ణమూర్తి, నాగమాంబ పాల్గొన్నారు.

పాఠశాలకు కుర్చీల వితరణ


వల్లాపల్లిలో పాఠశాలకు కుర్చీలు అందజేస్తున్న ట్రస్ట్

బల్లికురవ: మండలంలోని వల్లాపల్లి గ్రామంలోని ఉన్నత పాఠశాలకు, అంగన్‌వాడీ పాఠశాలకు గ్రామ ట్రస్ట్ తరఫున ఆదివారం కుర్చీలు వితరణగా అందజేశారు. గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాల ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ అయిన భవనాలు, ఫర్నిచర్ కొరతతో ఉపాధ్యాయులు, విద్యార్థులకు అవస్థలు తప్పటంలేదు. గత విద్యా సంవత్సరంలో ట్రస్ట్ పాఠశాలలోని విద్యార్థులకు పరీక్షలు రాసేందుకు ప్యాడ్‌లు, పెన్నులు ఉపాధ్యాయులకు కుర్చీలు అందజేశారు. ఈ విద్యా సంవత్సరంలో కూడా 5 కుర్చీలను అందజేశారు. గ్రామ కూడలిలోని వైఎస్సార్ విగ్రహం ప్రక్కన నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రానికి ఒక కుర్చీని అందించారు. పాఠశాల హెచ్‌ఎం ఉదయ్ భాస్కర్, అంగన్‌వాడీ కార్యకర్తల నాగలక్ష్మి, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

తీరంలో సండే సందడి


సముద్రంలో స్నానాలు ఆచరిస్తున్న పర్యాటకులు

చీరాల టౌన్: మండలంలోని వాడరేవు సముద్ర తీరం సందడి నెలకొంది. ఆదివారం కావడంతో చీరాల, పర్చూరు, అద్దంకి, పల్నాడు జిల్లాలోని నర్సరావుపేట, చిలకలూరిపేట నియోజకవర్గాల్లోని గ్రామాలతో పాటు తెలంగాణ రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు చెందిన పర్యాటకులు అధిక సంఖ్యలో వాడరేవుకు చేరుకున్నారు. సముద్రపు మన్నుతో ఆడలాడుతుకుంటూ కేరింతలు కొడుతూ సముద్రంలో స్నానాలు ఆచరించారు. తీరం ఒడ్డున ఉన్న అంజనేయస్వామికి, గ్రామంలోని కోదండ రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తీరంలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రూరల్ ఎస్సై అంబటి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో సివిల్, మెరైన్ పోలీసులు బందోబస్తు, గజ ఈతగాళ్లతో ఏర్పాట్లు చేయించారు.

హిందూ ధర్మ ప్రచారం నిర్వహించాలి

పర్చూరు(చినగంజాం): గడపగడపకు హిందూ ధర్మ ప్రచారం నిర్వహించాలని మత ప్రచారాలను అడ్డుకోవాలని గుంటూరు విభాగ్ కార్యనిర్వాహక్ గోలి రామ్మోహనరావు అన్నారు, ఆదివారం పర్చూరు అద్దంకి నాంచారమ్మ అమ్మవారి దేవస్థానం ప్రాంగణంలో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఆధ్వర్యంలో పర్చూరు ఖండ సమావేశం నిర్వహించారు.

సీజనల్ వ్యాధులు ప్రమాదకరం

చీరాల టౌన్: గ్రామీణ ప్రాంతాల్లోని వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండి గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని మండల ప్రత్యేకాధికారి, వ్యవసాయశాఖ జాయింట్ డైరెక్టర్ ఎం. సుబ్రమణ్యేశ్వరరావు సూచించారు. ఆదివారం మండలంలోని పలు గ్రామాల్లో జరుగుతున్న ప్రత్యేక డ్రైవ్ కార్యక్రమాలను ప్రత్యేకాధికారి పరిశీలించారు. గ్రామాల్లోని వీధుల్లో పేరుకుపోయిన చెత్తకుప్పలను తొలగించి బ్లీచింగ్ చల్లించడంతో పాటు దోమలకు ఆవాసాలైన మురుగునీటి కుంటల్లో ఆయిల్‌బాల్స్ వేయించారు. ఈసందర్భంగా ప్రత్యేకాధికారి మాట్లాడుతూ మండల పరిధిలోని 1 గ్రామ పంచాయతీల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్య సిబ్బంది ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. గ్రామాల్లోని చిన్నపిల్లలు, వృద్ధులు అనారోగ్యానికి గురికాకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. చిన్నపిల్లలకు, గర్భిణులకు అందించే వ్యాక్సిన్లను క్రమం తప్పకుండా వేయాలన్నారు. ప్రజలంతా వేడిగా ఉన్న ఆహార పదార్థాలు తినాలని, నిల్వ ఉన్న ఆహారాన్ని తీసుకోవద్దన్నారు. ఖాళీ కొబ్బరి బోండాల నిల్వలు, మురుగునీటి కుంటలు లేకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. ప్రత్యేకాధికారి వెంట పంచాయతీ సెక్రటరీ శ్రీనివాసరావు, పీహెచ్‌సీ వైద్య సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.


జె.పంగులూరు: మురుగు కాలువలో బ్లీచింగ్ చల్లిస్తున్న అధికారులు


రామకృష్ణాపురంలో ఆదేశాలిస్తున్న మండల ప్రత్యేకాధికారి సుబ్రమణ్యేశ్వరరావు

జె.పంగులూరు: గ్రామాలు పరిశుభ్రంగా ఉండాలని.. పూడిక తీత పనులు చేయాలని మండల ప్రత్యేక అధికారి అనంతరాజు కోరారు. జిల్లా వ్యాప్తంగా వైరల్ జ్వరాలు ప్రబలుతున్న కారణంగా తూర్పు కొప్పెరపాడు, తూర్పు తక్కెళ్ళపాడు, జనకవరంలో ఆదివారం జరుగుతున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరు ప్రతి గ్రామంలో శానిటేషన్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి గ్రామంలో నీరు నిల్వ ఉన్న చోట ఆయిల్‌బాల్ వేయించి, ఎబేట్ ద్రావణం స్ప్రే చేయించారు. గ్రామాల్లో జ్వరంతో బాధపడుతున్న వారిని పరామర్శించారు. గ్రామాల్లో ప్రతిరోజూ జ్వరంతో బాధపడుతున్న వారి సర్వే చేయాలని డాక్టర్లను ఆదేశించారు. ఇన్‌చార్జ్ ఎంపీడీఓ కె. సుమంత్, వైద్యాధికారి కె. శివచెన్నయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శివయ్య, పంచాయతీ కార్యదర్శులు రాంబాబు, ఎస్ఎంలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అందరికీ ఆధునిక వైద్యం

చీరాల: అభివృద్ధి చెందుతున్న చీరాల నియోజకవర్గంలో ఆధునిక వైద్యపరికరాలతో అందరికి అందుబాటులో వైద్య సేవలందిస్తున్నట్లు అనిత హాస్పిటల్ డాక్టర్లు కె.బాలాజీ, కె.అనిత అన్నారు. చీరాల్లోని బోసనగర్‌లో గల అనిత హాస్పిటల్ ప్రారంభించి ఏడాది అయిన సందర్భంగా అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏడాది కాలంగా తమపై ఉన్న నమ్మకంతో సహకరించిన అందిరికీ కృతజ్ఞతలు తెలిపారు.

మోసపు హామీలతో అధికారంలోకి..

చినగంజాం: చంద్రబాబు తన మోసపు హామీలతో ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చాడని చినగంజాం మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ మున్నం నాగేశ్వరరెడ్డి అన్నారు. ఆదివారం రాత్రి బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా మండలంలోని పల్లెపాలెం పంచాయతీలో నాగేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. పెద్దపల్లెపాలెం, తూర్పు పల్లెపాలెం, బాపయ్యనగర్‌లో పర్యటించారు. ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


పల్లెపాలెంలో ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు